# పాపం పశుపతి!

అనుక్షణం వెంట వుండే మహిషం రెండురోజులుగా కంటికి కన్పించకపోయేసరికి యమధర్మరాజుకి తిక్క పట్టినట్టయింది! మనసు కకావికలమైంది!

తన మహిష వాహనం ఎక్కడైనా తప్పిపోయిందా? తనమీద కోపంతో భూలోకానికి దౌడు తీసిందా? ఎవరైనా కిడ్నాప్ చేసివుంటారా?... తనను వీడి ఎప్పుడూ ఎక్కడికీ వెళ్ళిన దాఖలాల్లేవు. అలాంటిది... వున్నట్టుండి ఎందుకు ఎలా అదృశ్యమైపోయినట్టు?

ఇంద్రునికి ఐరావతం... శ్రీహరికి గరుత్మంతుడు ముక్కంటికి నంది వాహనాలుండగా వారికి తన వాహనంతో పని ఏముంటుందీ?... ఆఁ! ఏ వాహనమూ లేనివాడు బ్రహ్మదేవుడే!... ఆయనగాని తన దున్నను కాజేసియుండలేదు కదా?.. డౌట్ పడ్డాడు యముడు.

మానసికంగా క్షోభకు సమవర్తి గురి అవుతున్న సమయంలో చిరతలు వాయించు కుంటూ... మహతి మీటుతు అటుకేసి వచ్చి చింతాక్రాంతుడైన యముని చూచి అచ్చెరువంది కారణమేమిటని ప్రశ్నించెను నారదుడు!

'ఏమని నుడివెద నారదా...? అంతా నా ఖర్మ!?'

'మీ తలరాత తల్లకిందులైనదా ఏమిటీ? నీ పోస్ట్ పదిలముగానే వున్నది కదా?! నిన్నెదిరించి... నీతో తలపడి... ఓడించి... ఎవరేని నీ సింహాసనాన్ని స్వాధీనపరచుకొనలేదు కదా?...' క్రీగంట చూస్తూ సహజధోరణిలో అడిగేడు నారదుడు.

నారదుని మాటల్లోని వెటకారానికి యమునికి వళ్లుమండినట్లాయెను! అరికాలి మంట నెత్తికెక్కినట్టన్పించెను! అసలే 'దున్న' కన్పించక తాను అఘోరిస్తూంటే మధ్య నారదుని పరిహాసమొకటాయని పుండు మీద కారం చల్లినట్లన్పించె!

'నారదా! చాలించు నీ పరిహాసము. నా మహిషము కన్పించని కారణమున నేను నా డ్యూటీ నిర్వహించుటకు ఎక్కడికీ వెళ్లలేని దుస్థితి ఏర్పడినది. నా బాధ నీకు అర్థము కాకున్నది...' అని సమవర్తి వగర్చెను.

తిక్క కుదిరినది! స్వంత వాహనముపట్ల అంతటి నిర్లక్ష్యమా? ఇదేమైనా సైకిలా? టూ వీలరా? నాలుగు చక్రాల కారా? పోతే పోయెనని మరియొకటి కొనుక్కొని వాడుకొనుటకు!... డూప్లికేట్ వాహనము కావలెనన్న భూలోకమునకు వెడలవలె! పశుసంపద అచ్చటనే కదా వుండును... అని మనంబున పరిపరి విధంబుల నారదుడు తలంచదొడగె.

'ఏమి నారదా మౌనము వహించితివి?... ఏదేని సలహా చెప్పుము...'

'నీకు సలహా ఇచ్చువాడనా సమవర్తీ? అయినను చెప్పెదను ఆలకింపుము! నీవు ఆలస్యము చేయక నీవద్ద గల నీ వాహనమైన మహిషం ఫోటో కాపీలు తీయించి... 'దున్నపోతు మిస్సింగ్' అని వివరాలతో కూడిన ఓ పత్రమును తయారుచేసి అచ్చువేయుటకు అన్నిపత్రికలకు పంపుము. అన్ని టి.వి. కేంద్రముల ద్వారా వరుసగా 'కన్పించని మహిషము' అని పబ్లిసిటీ ఇచ్చునటుల కార్యోన్ముఖుడవు కమ్ము' ఎంత డబ్బు ఖర్చైననూ వెనకాడకుము... చివరికి పోలీసువారికి కూడా ఫిర్యాదు ఇమ్ము! అటుల చేసిన నీ వాహనము తప్పక దొరకగలదు...' తనకు తోచిన సలహా ఇచ్చి నారదుడు అదృశ్యమాయెను.

నారదుడు ఇచ్చిన సలహా యమునికి బొత్తిగానచ్చలేదు. అతను చెప్పినటుల చేయ వలెనన్న తాను భువికి ఏతెంచవలె? వాహనము లేక ఎటుల భూలోకమునకు వెళ్ళుట?...

తన లోకమున దున్నలను అద్దెకిచ్చు సదుపాయము లేకుండె! పోనీ శ్రీమహావిష్ణువుని అర్థించి పుష్పకవిమానమును కొన్నాళ్ళు అద్దెకు తీసుకునిన బాగుండునేమో? తన భటులు సైతం వాజమ్మలే! చచ్చిన పీనుగలను తోడ్కొని వచ్చుట ఎరుగుదురే కాని... తన మహిషము ఏమైనదీ వారు తెల్సుకొనలేని అశక్తులైరి!

పోనీ శ్రీమహావిష్ణువు వద్దకెళ్ళి జరిగినదంతయూ చెప్పి సాయము కోరిన ఎటులుండును?

అమ్మో! శ్రీహరి కడు మేధావేకాదు...పెద్ద లిటిగెంట్! సవాలక్ష ప్రశ్నలు వేస్తాడు. ఎప్పుడు పోయిందంటాడు? ఎందుకు పోయిందంటాడు?... ఆయన ప్రశ్నలకు జవాబులిచ్చుట తనవల్ల కాదు.

కొత్తవాహనం వేరొకటి తనకు ప్రొవైడ్ చేయకపోగా... మిస్సైన దున్నపోతు కోసం ఓ ఎంక్వయిరీ కమిటీ వేయాలంటాడు. సిట్టింగ్ జడ్జి చేత విచారణ జరిపించాలంటాడు. ఈ విధమైన సతాయింపు తాను పడలేడు!

చివరకు... కన్పించని మహిషం కోసం ప్రకటనలు ఇచ్చుటయే మంచిదని... చిత్రగుప్తుని కేకేసి తాను కోరిన విధము చేయమని ఆజ్ఞాపించాడు.

'సారూ! ఫైనాన్షియల్ శాంక్షన్... బడ్జెట్ కేటాయింపులు లేకుండా మనం కోరిన విధముగా ప్రకటనలకై పెద్దఎత్తున ధనము ఖర్చు చేయజాలము. ఆర్థిక శాఖ వారిచే చీవాట్లు తినవలసివచ్చును!...' తనకు తోచింది చెప్పాడు చిత్రగుప్తుడు.

'చాలింపుము నీ అసమర్థపు మాటలు!... మనకెంత 'ఫండ్' కావలెనో ఎస్టిమేట్ తయారుచేసి... ఓ ఫైలు మీద నోటులో వివరాలు తెలుపుతూ పట్టుకురమ్ము. నేనే స్వయముగా శాంక్షన్ తెచ్చుకొనెదను...' అని హూంకరించెను.

చిత్రగుప్తుడు యముని అరుపులకు బెంబేలెత్తి తోకముడిచి 'అటులనే ప్రభూ' అన్చెప్పి అచటనుండి వెడలిపోయెను.

★★★★★

పశుపతి పేరున్న పశువుల డాక్టర్! ఏరి కోరి కావాలని వెటర్నరీ కోర్స్ చదివి పట్టా పుచ్చుకుని పాతికేళ్లయింది. ఎంతో అనుభవజ్ఞుడు.

పశువులు నోరులేని జంతువులు! మనుష్యులకు మల్లే ఇష్టమొచ్చినట్లు మాట్లాడలేవు. వాటి మనసుల్లో దురాలోచనలుండవు. మానవులకు మల్లె వాటికి మాయలు మర్మాలు తెలియవు. అందుకే పశుసేవే మానవసేవ కంటే గొప్పదని నిర్ణయించుకుని మరీ పశువుల డాక్టరైనాడు.

అదే మనుషులను ట్రీట్ చేసే డాక్టరైతే... కన్సల్టేషన్ రూపంలో బోలెడు ఫీజులు గుంజుతాడు. సర్జనైతే ఆపరేషన్లంటూ వేలకు వేలు డిమాండ్ చేస్తాడు.

కానీ... తానట్లా కాదు! తాను పశువుల భాష... వాటి అరుపుల్లో... ఆక్రందనల్లో బాధ భావం పసి కట్టగలడు. మూగజీవాల దృష్టిలో తానో దేవుడు. తాను వైద్యం చేసిన పశువులు వాటి అనారోగ్యాన్ని పారద్రోలినందుకు తలలాడించి... కొమ్ములు తిప్పుతూ మూగభాషలో తనకు కృతజ్ఞత తెలియచేస్తయ్. ఆ తృప్తి చాలు తనకు!

పశుపతికి పిల్లాపీచే లేకపోవటంతో లేగదూడలను ఆప్యాయంగా దగ్గరకు తీసుకుని... వాటిని ప్రేమగా దువ్వి ఆడుకుంటూ తృప్తిపడటం అతనికి అలవాటైంది.

ఒకరోజున డ్యూటీలో వుండగా... ఆకాశమార్గాన పయనిస్తూ ఓ దున్నపోతు కన్పించటంతో నివ్వెరపోయాడు.

దున్నకు రెక్కలు లేవు. అయినా ఆకాశమార్గాన పయనించటం... ఆశ్చర్యమన్పించింది.

నల్లగ... తారు రంగులో నిగనిగలాడుతూ మెరుస్తూ... చూపరులకు ముచ్చట గొలుపుతోంది. ఎర్రగ చింతనిప్పుల్లాంటి దాని కళ్ళు... అందమైన శరీరం... ఇలాంటి దున్నని... ఇంతటి బలము కలిగిన దున్నను తాను సర్వీసు మొత్తంలో చూడలేదు.

ఇదేదో మహత్తు కలిగిన పశువై యుండాలన్పించింది. రెక్కలు లేకుండానే ఆకాశమార్గాన విహరిస్తున్నదంటే... ఇది తప్పక గంధర్వలోకానికి చెందినదై వుండాలనుకున్నాడు.

ఆ మహామహిమాన్విత మహిషం వేసే రంకెల శబ్దానికి... ఆకాశమురిమినట్టు భయం గొలుపుతోంది.

ఏ గంధర్వుడో శాపవశాత్తూ ఎనుము రూపం దాల్చి వుండవచ్చనుకున్నాడు పశుపతి!

ఆ విచిత్ర మహిషం భూమి వైపు రాసాగింది.

అది తిన్నగా వచ్చి తన పశువుల ఆసుపత్రి ప్రాంగణంలో దిగటంతో పశుపతి దిగ్భ్రాంతికి లోనయ్యాడు. కళ్ళకు మైకం కమ్మినట్లు ఫీలయ్యాడు. కొద్దిక్షణాలు నోటి వెంట మాట కరవైంది. చలనంలేని బొమ్మలా చూస్తూ వుండిపోయాడు.

మహిషాన్ని మచ్చిక చేసుకోవటం ఎలాగాని సీరియస్‌గ ఆలోచించనారంభించాడు పశుపతి!

దగ్గరకెళ్ళి... వీపు ఆప్యాయంగా నిమిరితే!... అమ్మో బెదిరిపోయి కుమ్మితే... డేంజర్! ప్రాణానికే అపాయం! పోనీ నాలుగు పరకలు పచ్చిగడ్డి తీసుకెళ్ళి తిన్పించటానికి ప్రయత్నిస్తేనో?...

ఆ మహిషం ... ఆకాశం నుండి దిగివచ్చిందాయె... గడ్డి గాదం తింటుందో లేదో తెలీదు.

దానికి భూలోకం కొత్తే అయినా తనవేపు సీరియస్‌గా చూస్తూ కొమ్ములిసరటంలేదూ అంటే... తాను రావలసిన చోటికే వచ్చిందన్న తృప్తి వుందన్నమాట దానికి! సో...! ఇహ తననేమి చెయ్యకపోవచ్చు! అన్పించింది.

దాని ఆకలి చూపులకేసి చూస్తుంటే... ఆడతోడు దొరక్క పరితపిస్తున్న మహిషంలా వుంది... తన ఆస్పత్రికి 'ఎద'కోసం ఎన్నో గొడ్లు వచ్చినయ్. ఆర్టిఫీషియల్ ఇన్‌సెమినేషన్ ట్రై చేయాలనుకున్న తరుణంలో ఈ దున్న వచ్చి పశుపతిలో ఎన్నో ఆశలు రగిల్చినట్టన్పించింది.

ఇలాంటి మేలుజాతి దున్నతో... గేదెలను దాటిస్తే... పుట్టే సంకర పశుసంపద బహుమేలైనదిగా వుంటుందనే నిర్ణయానికొచ్చాడు.

ఇంతలో ఆ మహిషమే తోకాడిస్తూ... పశుపతిని సమీపించింది! అంటే... అనుభవశాలి అయిన పశువుల డాక్టర్‌గా తనకు బోధపడిందేమిటీ అంటే... దానికి తిండి కంటే ముందు... జతకోసం ఆరాటపడుతోందన్నమాట!

వెరీగుడ్!... కానున్న పని గంధర్వులు చేసినట్టు ఆ మహిషాన్ని దువ్వాడు. దాని భావం... భాష... గ్రహించగలిగేడు.

వెంటనే కాంపౌండర్‌ని కేకేసి చెట్టుక్రింద వున్న గేదెల దగ్గరకు మహిషాన్ని తరలించమన్నాడు. దట్సాల్!!

★★★★★

యమధర్మరాజు తప్పిపోయిన తన మహిషం కోసం లోకాలన్నీ గాలించి... చివరికి ఆకాశమార్గాన భూలోకానికొచ్చి వెతుకులాట ప్రారంభించాడు.

ఊరూవాడా గాలిస్తున్నాడు. యముడు మారువేషంలో వున్నందువల్ల ఎవ్వరూ తనను

గుర్తించగల స్థితిలో లేరు.

తిరిగి తిరిగి విసిగి వేసారి... మరల ఆకాశమార్గాన విహరిస్తున్న సమయంలో... తన మహిషం వున్న చోటు గుర్తించి రయ్యిన వాయు మనోవేగంతో భువిపై దిగి పశువుల ఆస్పత్రి ప్రాంగణంలో కొచ్చాడు.

తనివితీర తన మహిషాన్ని చూచి పోల్చుకుని అది త వాహనమేనని గుర్తించగలిగాడు. అది కన్పించినందుకు యముని వదనారవిందం సంతోషంతో పురివిప్పింది.

తన దున్న... సారీ! వాహనం ఇక్కడున్నదేల చెప్మా...? ఇది బందెల దొడ్డివలె అవుపించుటలేదు. ఎవరూ దీనిని బంధించుట కన్పించుటలేదాయె. యధేచ్ఛగా అటూ ఇటూ తిరుగుచున్నది. గేదెలతో కలిసిపోయి వాటి స్నేహానికి అలవాటు పడినటుల అగుపించి... ఆశ్చర్యమునకు సమవర్తి లోనాయెను.

ఇది ఏమి కలియుగమాయ? గేదెల వెంట తిరిగే సాహసమెటుల చేయుచున్నది?

తాను మారువేషములో వున్న కారణాన తన వాహనము గుర్తించలేకున్నదేమోని కొంచెం సేపు తలపోసాడు.

ఇంతలో అక్కడికి పశుపతి వచ్చి మారువేషధారియగు యముని చూసాడు.

'ఎవరు మీరు? నా అనుమతి లేకుండా ఈ హాస్పిటల్ ప్రాంగణంలో తిరుగుచుంటిరేమి? గొడ్లను కాజేయవలెననే దురాలోచనతో వచ్చితివా? అటులైన నిన్ను పోలీసులకు పట్టించెదను...' దురుసుగా మాట్లాడాడు పశుపతి.

ఒక్కముక్క అర్థమైతే ఒట్టు యముడికి!

'మానవా!... ఏమి నీ పరిహాసము? నేనెవరో నీకు తెలిసిన నీ గుండె ఆగి చనిపోవుదువు.... ఆ కన్పించు మహిషము నా వాహనము! అనగా... నేను యమధర్మరాజుని...' తన గురించి బ్రీఫ్‌గా చెప్పుకున్నాడు.

'నాకేమైనా మెంటలనుకున్నావా? నీవు కాదు... నేను నీ పాలిట యముడిని! నన్నెదిరించిన ... కటకటాల పాలగుదువు...' రెచ్చిపోయాడు పశుపతి.

'అద్సరే... నా వాహనమునకు ఏమి ఆహారము పెడితివి?...'

'తౌడు... పచ్చిగడ్డి... ఎండుగడ్డి... కుడితి ఇచ్చినను అది ముట్టలేదు...'

'తెల్సినదా ఇప్పటికైనా?... ఇప్పటికైనా దానికసలు ఎటువంటి ఆహారము అవసరము లేదు... నీకు తెలియక తంటాలు పడితివి మానవా...'

'నీవు దాని యజమానివైన నీ వద్ద కది ఎందుకు వచ్చుటలేదు...'

'అదే అర్థమగుటలేదు...'

'నీకెటుల బోధపడును. దానికి సంసార జీవితము లేక ఎన్నో యుగాలుగా తోడు కొరకై పరితపించుచున్నదను విషయము నీవు గ్రహించకపోతివి!... అందుకనే పగ్గాలు తెంపుకుని జతకోసం ఈ లోకమున కొచ్చినది...'

'చాలించుము నీ అధిక ప్రసంగము!... నా మహిషాన్ని నేను తోడ్కొని పోయెదను...'

దగ్గరైన యముని చూచి తల విదిలించి కుమ్ముటకై సిద్ధపడటం చూచి యముడు భయకంపితుడాయెను.

'చూశావా! అది నీద్దైన అటుల ఎందుకు చేయును. కావున పిచ్చివానివలె వాగక... నీతోవన నువ్వు వెళ్ళు!!...'

'నీతో సంభాషించి ప్రయోజనము లేకున్నది. నీవు నా ప్రయత్నమును అడ్డుకొనినచో నేను నిన్ను శపించెదను... యముడు ఉగ్రుడాయెను.

'నీవు... నన్ను... శపిస్తావా?... నీవేమైనా వశిష్ఠుడవా?... విశ్వామిత్రుడివా?... లేక త్రిమూర్తులలో ఒకనివా?...' పశుపతి పకపక నవ్వాడు.

'అయిన... అనుభవించుము! నీవు దున్నపోతువై ఈ భూలోకమున ఇకపై సంచరించ గలవు!... నా శాపానికి తిరుగులేదు...'తన నిజరూపము చూపిన యముడు పశుపతిని శపించె.

పశుపతి మానవ శరీరము విడనాడి దున్న రూపు దాల్చెను.

సొగ తాగనివాడు కదా దున్నపోతై పుట్టవలసింది... ఇతడు... సారీ! యముడు మానవుడైన తననేల శపించె?...

ఖర్మ... ఖర్మ!... మళ్ళీ మానవ జన్మ తనకు ఎన్నడు ప్రాప్తించునో?... అంతవరకు పశువులా బ్రతకాల్సిందేనాని పశుపతి విలపించె. అయినా... నన్ను శపించుటకు యముని పవర్సెవరిచ్చారో అర్థంకాని సమస్యగా మారి... తనలో వచ్చిన పశుమార్పుకి మిక్కిలి చింతించె!

యమధర్మరాజు తన మహిషమునెక్కి అత్యంత ముదమంది ఆకాశమార్గాన తన నిజలోకమునకరిగె!!

- సమాప్తం -